సాక్షి తిరుపతి
మంగళవారం । 30 । జులై । 2024



విద్యార్థి దశ నుంచే..
విద్యార్థి దశ నుంచే క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఉపాధ్యాయులు ఆ దిశగా ప్రోత్స హించాలని కలెక్టర్ సూచించారు. - 8లో



మాతాశిశు మరణాల నివారణే..
మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్యసిబ్బంది కృషి చేయాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రధాన అధికారి ఆదేశించారు. - 8లో



బ్యాంక్‌లో అగ్నిప్రమాదం
విద్యానగర్‌లోని యూనియన్ బ్యాంక్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. - 8లో

దండుకో.. పిండుకో.

చెలరేగి పోతున్న తమ్ముళ్లు



వరగలి క్రాస్ రోడ్డులో వెలసిన భారీ వెంచర్



అధికార పార్టీ నేతలు కొందరు దాదాగిరికి దిగుతున్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని అడ్డదిడ్డంగా సంపాదించే పనిలోపడ్డారు. ఇందులో ముఖ్యంగా రియల్టర్లు, కాంట్రాక్టర్లు, వ్యాపారులపై దృష్టి సారించారు. వారిని బెదిరిస్తూ.. భయపెడుతూ భారీ ఎత్తున వసూళ్లకు తెగబడుతున్నారు. వారిని లొంగదీసుకునేందుకు తాము చెప్పేవరకు రిజిస్ట్రేషన్లు చేయొద్దంటూ సంబంధిత సబ్‌రిజిస్ట్రార్లకు హుకుం జారీచేస్తున్నారు. ఎవరైనా ఎదురు తిరిగినా.. ఫిర్యాదు చేసినా 'తలకాయలు' లేస్తాయంటూ హెచ్చరికలు జారీచేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో కొందరు అధికార పార్టీ నేతలు అడిగినంత సమర్పించి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. తెరచాటున తిరుపతి, చిత్తూరు జిల్లాల వ్యాప్తంగా జరుగుతున్న ఈ వరుస ఘటనలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక.. ఎలా పరిష్కరించుకోవాలో అర్థంగాక పలువురు భయాందోళనలో మునిగిపోతున్నారు.

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అధికార పార్టీ నేతల అరాచకాలు పెచ్చుమీరుతున్నాయి. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా.. అధికారం ఉన్నప్పుడే డబ్బు సంపాదించాలనే యావలో కొందరు నేతలు లీనమైపోతున్నారు. ఇందులో భాగంగానే దౌర్జన్యాలు.. దందాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. శ్రీకాళహస్తి, గూడూరు, తిరుపతి, పుంగనూరు పరిధిలో జరిగిన వరుస దౌర్జన్యాలు చూస్తుంటే వారి నిజ స్వరూపం ఏంటో అర్థమవుతోంది. అవేంటో మీరే ఓ లుక్కేయండి..

తవ్వేసి..మళ్లీ పూడ్చేసి



కాలువను పూడ్చేసిన దృశ్యం

తిరుపతి జిల్లా, గూడూరు నియోజకవర్గం, చిల్లకూరు మండలం జాతీయ రహదారి వెంబడి పలు ప్రాంతాలలో లే అవుట్లు వెలుస్తున్నాయి. అందులో ఒకటి ప్రైవేటు వెంచర్. గత ఏడాది వరగలి క్రాస్ రోడ్డు ప్రాంతంలో పడమర వైపున జాతీయ రహదారి, దక్షిణం వైపు సాగరమాల రహదారి ఉండేలా నెల్లూరుకు చెందిన ఓ రియల్టర్ 48 ఎకరాలను కొనుగోలు చేసి వెంచర్ వేశారు. ఈ భూమిలో గూడూరు మండలం పోటుపాళెంకు చెందిన చెరువుకు సాగునీటిని అందించే ఒరవ కాలువ ఉండేది. యాజమాన్యం వద్ద భూమి కొనుగోలు చేసిన రియల్టర్ భవిష్యత్‌లో సమస్య తల్తెకుండా చర్యలు తీసుకున్నారు. ల్యాండ్ కన్వర్షన్ చేసుకునే సమయంలోనే రైతులతో చర్చించి పంట కాలువ అలైన్‌మెంట్‌ను మార్చుకుని సిమెంట్‌తో కాలువను నిర్మించి ప్లాట్ల విక్రయాలకు శ్రీకారం చుట్టారు. అదే సమయంలో ఎన్నికలు వచ్చాయి. ఆ తర్వాత అధికారంలోకి టీడీపీ రావడమే తరువాయి.. ఆ పార్టీకి చెందిన నాయకుడు ఆ వెంచర్‌లో ఉన్న లోటుపాట్లు తెలుసుకున్నారు. వెంటనే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి భారీ యంత్రాలతో కాలువను తవ్వి హద్దులు ఏర్పాటు చేసి అమ్మకాలకు ఆటంకం కలిగించారు. కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టిన వెంచర్ నిర్వాహకులు టీడీపీ నాయకుడిని కలిసి కన్నీరుపెట్టుకుని ప్రాధేయపడ్డారు. ప్లాట్ల అమ్మకాలు సజావుగా సాగాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని రియల్టర్ బతిమలాడినా వినలేదు. అమరావతిలో ఉన్న నాయకుడిని వెళ్లి కలిశారు. అక్కడ రియల్టర్‌కి చేదు అనుభవమే ఎదురైంది. చేసేది లేక వారు డిమాండ్ చేసిన మొత్తంలో రూ.2 కోట్లు అడ్వాన్స్ ఇచ్చినట్లు సమాచారం. మిగిలిన మొత్తం ప్లాట్ల అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తంలో నుంచి చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు గూడూరులో జోరుగా ప్రచారం జరుగుతోంది. డీల్ కుదిరాక తవ్వేసిన కాలువను అధికారులే పూడ్చివేసి ప్లాట్ల అమ్మకాలకు లైన్ క్లియర్ చేశారు.



పంట కాలువ అలైన్‌మెంటు మార్చి నిర్మించిన సిమెంట్ కాలువ

పంట కాలువ యథాతథంగా మార్కింగ్ చేశాం

వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో వేసిన వెంచర్‌లో మధ్యలో పంట కాలువ ఉన్న మాట నిజం. అయితే వెంచర్ యజమానులు గతంలోనే పంట కాలువ అలైన్‌మెంట్ మార్చుకునేలా దరఖాస్తు చేసుకుని ఉన్నారు. అలాగే పోటుపాళెం రైతులతో మాట్లాడుకుని వెంచర్‌లోని ప్రాంతంలో సిమెంట్ కాలువను ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికల అనంతరం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ద్వారా ఆ ప్రాంతంలో ఉన్న పంట కాలువను యథాతథంగా ఉండేలా మార్కింగ్ ఇవ్వాలని ఆదేశించారు. దీంతో సర్వేయర్, వీఆర్‌ఓ, ఆర్‌ఐలు రికార్డులను పరిశీలించి వెంచర్‌లో ఉన్న పంట కాలువకు మార్కింగ్ ఇచ్చాం.

– తహసీల్దార్ శ్రీనివాసులు, చిల్లకూరు, తిరుపతి జిల్లా

అలైన్‌మెంటు మార్చేలా దరఖాస్తు చేసుకోలేదు

వరగలి క్రాస్ రోడ్డులోని వెంచర్‌లో ఉన్న పంట కాలువ అలైన్‌మెంటు మార్చుతున్నట్లు ఇరిగేషన్ శాఖకు వెంచర్ యాజమాన్యం ఎలాంటి దరఖాస్తు చేసుకోలేదు. పంట కాలువను పూడ్చి వేసి పక్కనే సిమెంట్ కాలువ కట్టి ఉన్నా తమ శాఖ అనుమతులు లేకపోవడంతో ఫిర్యాదులు వచ్చాయి. వెంచర్‌లో గతంలో ఉన్న పంట కాలువను యథాతథంగా తవ్వాం. ఆ తర్వాత ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావడంతో కాలువను పూడ్చి వేశాం. ఇందులో ఎలాంటి ఒత్తిడీ లేదు.

– వెంకటసురేష్‌బాబు (ఏఈఈ, ఇరిగేషన్‌శాఖ, గూడూరు)

రిజిస్ట్రేషన్లు చేస్తే తాటతీస్తాం!



శ్రీకాళహస్తి పరిధిలో రేణిగుంట, శ్రీకాళహస్తి, తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రాయలసీమలోనే కీలకమైంది. ఈ కార్యాలయం నుంచి ఏటా ప్రభుత్వానికి రూ.150 కోట్లు ఆదాయం ఉంటుంది. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి, తిరుపతి విమానాశ్రయం కూడా ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉండడంతో భూములు, ప్లాట్లకు మంచి డిమాండ్ ఉంది. రియల్టర్లు కూడా ఎక్కువ మంది రేణిగుంట పరిధిలో భూములు కొనుగోలు చేసి లే అవుట్లు వేసి విక్రయిస్తుంటారు. అందులో భాగంగా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్లాట్ల క్రయ, విక్రయదారులతో కిటకిటలాడుతుంటుంది. అదేవిధంగా శ్రీకాళహస్తి, తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోనూ ప్లాట్ల క్రయ, విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ నేత ఒకరు రియల్టర్లు, సబ్‌రిజిస్ట్రార్ల నుంచి మామూళ్లు రాబట్టడం కోసం స్కెచ్చేశారు. మామూళ్ల కోసం శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో రిజిస్ట్రేషన్లు ఆపేమయని అధికార పార్టీకి చెందిన నాయకుడు సబ్ రిజిస్ట్రార్ అధికారులకు ఫోన్‌చేసి హుకుం జారీ చేసినట్లు సమాచారం. తాను చెప్పే వరకు రిజిస్ట్రేషన్లు చేయకూడదని ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఈనెల 8వ తేదీ నుంచి శ్రీకాళహస్తి పరిధిలోని కొన్ని భూములు, అప్రూవల్, నాన్ అప్రూవల్ ప్లాట్లు రిజిస్ట్రేషన్లు ఆపేశారు. ఎవరైనా ఒత్తిడి చేస్తే తన వద్దకు పంపమని సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. టీడీపీ నేత వద్దకు వెళ్లిన కొందరు రియల్టర్లను బెదిరించడం, వెంచర్ అక్రమం అంటూ భయపెడుతున్నట్లు తెలిసింది. తాను అడిగినంత ఇస్తే రిజిస్ట్రేషన్లకు ఎటువంటి అభ్యంతరం ఉండదని స్పష్టం చేసినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న కొందరు రియల్టర్లు ఇదేం సంస్కృతి అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్రయ, విక్రయదారుల ఒత్తిడితో సబ్‌రిజిస్ట్రార్లు కార్యాలయానికి వెళ్లకుండా ముఖం చాటేస్తున్నారు. రెండు వారాలుగా ఇదే పరిస్థితి సాగుతోంది.

ఎవరికైనా చెప్తే 'తలకాయలు' ఉండవ్!



పుంగనూరు పరిధిలోని బోయకొండ గంగమ్మ అంటే ఉమ్మడి జిల్లాలో ప్రముఖశక్తి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయానికి వచ్చే భక్తులు ఎక్కువ మంది పొట్టేళ్లు, మేకపోతులు, కోళ్లు అమ్మవారికి బలి ఇచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారు. వాటి తలకాయలను భక్తులు అమ్మవారికే అని విడిచిపెట్టేస్తుంటారు. అలా ప్రతి రోజూ భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటుంటారు. ఆ తలకాయల కోసం దేవస్థానం ఏటా వేలంపాట నిర్వహిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చిలో నిర్వహించిన వేలంపాటలో తలకాయలు, వాటి క్లీనింగ్, దుకాణాలను లక్షల రూపాయలు చెల్లించి పాడుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ నేతలు దౌర్జన్యంగా కాంట్రాక్ట్ లాక్కున్నారు. లక్షల రూపాయలు చెల్లించామని ప్రాధేయపడుతున్నా విడిచిపెట్టలేదు. ఆలయం వైపు రావద్దంటూ హుకుం జారీచేశారు. వారం పది రోజులుగా ఎటువంటి డబ్బులు చెల్లించకుండా టీడీపీ శ్రేణులే భక్తులు అమ్మవారికి మొక్కుల రూపంలో విడిచిపెట్టే తలకాయలను వారే స్వాధీనం చేసుకుని విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. అదేవిధంగా మిగిలిన టెండర్లను కూడా టీడీపీ శ్రేణులే బలవంతంగా లాక్కున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఫిర్యాదు చేస్తే 'మీ తలకాయలు ఉండవు' అని హెచ్చరించడంతో కాంట్రాక్టర్లు ఎవ్వరికీ ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

న్యూస్‌రీల్

పోలీస్ శాఖకు 55 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాపరిష్కార వేదిక కార్యక్రమానికి ఫిర్యాదులు వెలువెత్తినట్లు జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి 55 ఫిర్యాదులు అందినట్లు ఆయన వెల్లడించారు. అందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

రేపు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి జిల్లాలోని అన్ని కళాశాలల్లో మిగిలిపోయిన వివిధ డిప్లొమో కోర్సుల సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఆ మేరకు తిరుపతి కే టీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. పాలిసెట్–2024 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారు, సాధించని వారు, ప్రవేశ పరీక్ష రాయని వారు స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావచ్చని, ఇదివరకే పాలిసెట్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్లు పొందిన వారు ఈ స్పాట్ అడ్మిషన్లకు అనర్హులని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా సీట్లు సాధించిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ పథకం వర్తించదని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లకు హాజరుకాదలచిన అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ ఉదయం 10 గంటలకు ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరవ్వాలని ఆయన కోరారు.

కావళ్లు..ఆధ్యాత్మిక పరవళ్లు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



కావళ్లు మోసుకొస్తున్న భక్తులు

తనపల్లి పద్మగిరి గుట్టపై కొలువైన దండాయుధపాణి స్వామి ఆలయంలో ఆడికృత్తిక మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. స్వామి వారి దర్శనానికి దాదాపు రెండు కిలోమీటర్ల మేర భక్తులు బారులు తీరారు. ఆలయంతో పాటు చుట్టుపక్కల కూడా ప్రత్యేక విద్యుత్ అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చంద్రగిరి డీఎస్పీ నరిసింగప్ప ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. – తిరుపతి రూరల్

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 79,327 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 25,894 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.93 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రూ.1.47 కోట్లు వసూలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో ఆదివారం సెలవు రోజున విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం కల్పించడంతో అన్ని బిల్లింగ్ కేంద్రాల వద్ద 25,300 మంది వినియోగదారులు, రూ.1.47 కోట్లు చెల్లించినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

- బకాయిల వసూలుపై ప్రత్యేక శ్రద్ధ
- విద్యుత్ సమస్యలను 9133331912కు వాట్సాప్ చేయొచ్చు
- సీఎండీ సంతోషరావు



సమీక్షిస్తున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంస్థ పరిధిలోని ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఫీడర్ ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్స్‌పై నిరంతరం సమీక్షిస్తూ పూర్తిస్థాయిలో నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినియోగదారులుకు మెరుగైన, సత్వర సేవలందించేందుకు వీలుగా వాట్సాప్, చాట్ బోట్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని, తద్వారా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం వుంటుందన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే వెంటనే సరిచేయాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్లు 1912, 18004251555333కు కాల్ చేయాలని, చాట్ బోట్, 91333 31912 నంబరుతో వాట్సాప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, పద్మ, సూపరింటెండింగ్ ఇంజినీర్లు సురేంద్ర నాయుడు, విజయన్, రమణ, ఉమాపతి, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుత్తణి సుబ్రమణ్యస్వామికి టీటీడీ పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న టీటీడీ ఈఓ

తిరుమల: తమిళనాడులోని తిరుత్తణిలో వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్య స్వామికి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి తరపున పట్టువస్త్రాలను టీటీడీ ఈఓ జె.శ్యామలరావు సోమవారం సమర్పించారు. టీటీడీ అధికారులకు తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయ చైర్మన్ శ్రీధర్, జాయింట్ కమిషనర్ అరుణాచలం, తిరుత్తణి ఆలయ బోర్డు సభ్యులు, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. పట్టు వస్త్రాలను స్వామివారికి అలంకరించారు. ఈ సందర్భంగా ఈఓ శ్యామలరావు మాట్లాడుతూ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన సుబ్రమణ్య క్షేత్రాల్లో తిరుత్తణి ప్రముఖమైనదన్నారు. టీటీడీ 2006 నుంచి ఆడికృత్తికను పురస్కరించుకుని సుబ్రమణ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆచారంగా వస్తోందని చెప్పారు. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, పారుపత్తేదార్ తులసిప్రసాద్, వేద పారాయణదారులు పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.70,970
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,339
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.84,500
రిటైల్ వెండి గ్రాము	రూ.86.50

లోఓల్టేజీ మంటలు



విద్యుత్ స్తంభంలో మండుతున్న వైర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ గ్రామం బీసీ కాలనీలోని వీధిలో ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ లోఓల్టేజీతో విద్యుత్ వైర్లలలో మంటలు చెలరేగాయి. దీంతో కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్‌చేసినా పట్టించుకోలేదని వాపోయారు. వీధిలో విద్యుత్ సరఫరా కోసం సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అయితే విద్యుత్ వాడకం పెరగడంతో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి లోఓల్టేజ్ సమస్య తలెత్తడంతో మంటలు చెలరేగాయి. చాలా ఇళ్లల్లో గృహోపకరణాలు కాలిపోయినట్టు బాధితులు వాపోయారు.

సూపర్ సిక్స్ పేరుతో దగా

మోసాలకు మారుపేరు చంద్రబాబు

- హత్యలు, విధ్వంసాలతో ప్రజాస్వామ్యానికి తూట్లు
- కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి



మాట్లాడుతున్న సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్ : సూపర్ 6 పేరుతో రాష్ట్ర ప్రజలను చంద్రబాబునాయుడు బురిడీ కొట్టించాడని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, మోసకారితనానికి ఆయన నిలువుటద్దమని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తీవ్రంగా విమర్శించారు. నాయుడుపేట పట్టణంలోని తన నివాసంలో సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ కుటమి పార్టీలు అధికారం చేపట్టిన రోజు నుంచే కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. ఆ పార్టీల నేతలు హత్యలు, దౌర్జన్యాలకు పాల్పడడం, దహన కాండలు చేస్తూ ప్రజాస్వామానికి తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్-6 పథకాలు పక్కాగా అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు కుయుక్తులు పన్నుతోందని ధ్వజమెత్తారు. విద్యార్థులకు తల్లికి వందనం పేరిట ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పి శఠగోపం పెట్టేశారన్నారు. అలాగే మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితమని చెప్పి ఇప్పటివరకు అమలు చేయకపోవడంతో వారు శాపనార్థాలు పెడుతున్నారని తెలిపారు. నిరుద్యోగ భృతి, ఫీజురీయింబర్స్‌మెంట్, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ రూ.1,500 పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల నియామకాల్లోనూ దండుకునే ప్రభుత్వాన్ని ఇప్పుడే చూస్తున్నామని చెప్పారు.

పక్కాగా నవరత్నాలు

ఎన్నికల ముందు ఇచ్చిన నవరత్నాల హామీలను నేరవేర్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేసి సంక్షేమ పాలన అందించారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, రత్నశ్రీ,నాయకులు కటకం జయరామయ్య, గంధవళ్లి సిద్ధయ్య, ధారా రవి, చదలవాడ కుమార్, రాము, ఓజిలి మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్ రెడ్డి, కే.భవాన్, కే.భాను తదితరులు పాల్గొన్నారు.

కూటమి అరాచక పాలన

- విధ్వంసాలు, హత్యలే ఎక్కువ • ఎమ్మెల్సీ సిపాయి ధ్వజం



సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి మంగళం: రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు చూస్తే ఒక ఆటవిక, అరాచక పాలన కనిపిస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు ప్రభుత్వం పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టకుండా కుయుక్తులు పన్నుతోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, హత్యలు, విధ్వంసాలకు ప్రధాన సూత్రదారి చంద్రబాబేనని, ఆయన ప్రత్యక్షంగా కాకుండా వెనుకుండి నడిపిస్తున్నారని ఆరోపించారు. ఆఖరికి గవర్నర్ చేత కూడా అబద్ధాలు చెప్పించిన సమర్థుడు చంద్రబాబు అని మండిపడ్డారు. 2019 మే 30న వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చే సరికి అప్పటికి రాష్ట్ర ఖజానాలో ఉన్నది కేవలం రూ.100 కోట్లు మాత్రమేనని గుర్తుచేశారు. అంతటి కష్టం ఉన్నా కూడా వరుసగా ఐదేళ్లలో పేదల ఖాతాల్లో రూ.2.71 లక్షల కోట్ల మేర వేశారని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన జూన్ 12కు సరిగ్గా రెండు రోజుల ముందు కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.5,655 కోట్లు వచ్చాయని, మొత్తంగా రూ.8వేల కోట్లు అందుబాటులో ఉన్నా పూర్తిస్థాయి బడ్జెట్‌ను చంద్రబాబు ప్రవేశపెట్టకపోవడం ఆయన మోసకారి విధానానికి నిదర్శనమని తెలిపారు. హామీల అమలుపై ప్రజలు ప్రశ్నించనీయకుండా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నారని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో ఆటవిక రాజ్యం

– ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త రాజేష్



నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు చూస్తే మొత్తంగా ఒక ఆటవిక అరాచక పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ.. కేవలం 50 రోజుల పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ అంటే అరాచకం, ఆటవిక పాలన అనే బ్రాండ్ ఇమేజ్‌ను సంపాదించుకున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయలేక సీఎం చంద్రబాబు నాయుడు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లేందుకు విడుదల చేస్తున్నవి శ్వేత పత్రాలు కావని, అవన్నీ సాకు పత్రాలని తెలిపారు. అసెంబ్లీలో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా కేవలం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టడం ప్రజలను మభ్యపెట్టేందుకే అన్నారు. అధికారం కోసం సీఎం చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టారని, ఇప్పుడు సూపర్‌సిక్స్ పథకాలంటే భయమేస్తోందని చెబుతూ, వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

బాధితులకు ఆపన్న హస్తం



టీడీపీ దాడుల్లో నష్టపోయిన అసిఫ్ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న చెవిరెడ్డి హర్షిత్

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు జగనన్న కొండంత అండ
- టీడీపీ దాడుల్లో నష్టపోయిన, గాయపడిన కార్యకర్తలకు చెక్కుల పంపిణీ
- హాజరైన చెవిరెడ్డి హర్షిత్

చంద్రగిరి: వైఎస్సార్‌సీపీ నాయకులకు ఆ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కొండంత అండగా నిలిచారు. అధికార పార్టీ నేతల దాడులు, విధ్వంసాలకు బలైపోయిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఆపన్న హస్తం అందించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో మండలంలోని 12 మంది బాధితులకు సోమవారం ఆయన తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి చెక్కులను అందజేశారు. చంద్రగిరి, తొండవాడ, చిన్నరామాపురం, కొటాలతో పాటు ఇతర గ్రామాలకు చెందిన బాధితులను ఆయన పరామర్శించి, చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు సృష్టిస్తోందని వాపోయారు. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న చంద్రగిరిలో సైతం దాడులు నిత్యకృత్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇలాంటి వాటిని ప్రోత్సహించలేదన్నారు. నిత్యం పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ మేలు చేశారని గుర్తుచేశారు. నియోజకవర్గ పార్టీ నాయకులు, ప్రజలకు నిత్యం చెవిరెడ్డి అందుబాటులో ఉన్నారని, ఎవరికి ఏ కష్టం వచ్చినా వారికి అండగా నిలవడంతో పాటు న్యాయపోరాటాలకు సైతం వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి విష సంస్కృతికి స్వస్తి పలికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను టీడీపీ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు మస్తాన్, ఎంపీటీసీలు మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, విరుపాక్షి ప్రసాద్, పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కుమార్ ఆచారి, సాయికిరణ్ యాదవ్, హేమంత్, వినోద్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రీడలకు పునాది

– కలెక్టరేట్‌లో ఒలింపిక్ క్రీడల సెల్ఫీ పాయింట్

తిరుపతి అర్బన్: విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు క్రీడలకు పునాది వేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. పారిస్ ఒలింపిక్ క్రీడల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు డీఆర్వో పెంచల కిషోర్, జిల్లా క్రీడల అధికారి సయ్యదుసాహెబ్ సెల్ఫీ దిగారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడల్లో పాల్గొంటున్న క్రీడా కారులకు జిల్లా తరపు నుంచి శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. మనదేశం నుంచి మను బాకర్ షూటింగ్‌లో పతకం సాధించడం దేశానికే గర్వకారణమన్నారు. జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

ఇద్దరిపై పోక్సో కేసు

నాయుడుపేట టౌన్: ఓ బాలికను బెదిరించి తరచూ లైంగికదాడికి పాల్పడిన ఇద్దరు యువకులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఆయన కథనం.. మండల పరిధిలో ఓ ఎస్టీ కాలనీకి చెందిన 16 ఏళ్ల బాలిక తన ఇంట్లో ఎవరూలేని సమయంలో అదే ప్రాంతానికి చెందిన 15, 16 ఏళ్లు ఉన్న ఇద్దరు యువకులు ప్రవేశించారు. తర్వాత బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాలిక తల్లి సోమవారం సాయంత్రం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసిన పోలీసులు ఆ ఇద్దరి యువకులను పట్టుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బ్యాంక్‌లో అగ్ని ప్రమాదం

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ప్రాంగణంలో ఉన్న యూనియన్ బ్యాంక్‌లో సోమవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో వర్షం కురుస్తుండగా పిడుగుపడినట్లు భారీ శబ్దం వచ్చింది. ఆ తర్వాత బ్యాంక్‌లో విద్యుత్‌షాట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. కోట ఫైర్‌స్టేషన్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే బ్యాంక్‌లోని కంప్యూటర్లు, ఫర్నిచర్, సీలింగ్ పూర్తిగా కాలిపోయినట్లు బ్యాంక్ మేనేజర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. నగదు లేదని, జరిగిన నష్టం అంచనా వేయాల్సి ఉందన్నారు.

రుణాల మంజూరు వేగవంతం

తిరుపతి అర్బన్: పొదుపు సంఘాలకు బ్యాంక్ రుణాలు వేగవంతంగా ఇప్పించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన సోమవారం డీఆర్‌డీఏ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి 24,158 పొదుపు సంఘాలకు రూ.1355.92 కోట్ల రుణాలు ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 2032 సంఘాలకు 161.92 కోట్లు మాత్రమే ఇచ్చారని వివరించారు. సంఘాలు మరింత బలోపేతం కావడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. మరోవైపు జూలైకి చెందిన సామాజిక భద్రత పింఛన్లు ఆగస్టు 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే అందించాలని చెప్పారు.

ఎవరి పరిధిలో వారు పరిష్కరించండి

– కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌కు 146 అర్జీలు



కలెక్టరేట్‌లో అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

తిరుపతి అర్బన్: ప్రజాసమస్యలకు సంబంధించి ఎవరి పరిధిలో వారు పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారమయ్యే వాటిని అక్కడే పరిష్కరించాలని చెప్పారు. చిన్నచిన్న సమస్యల కోసం కలెక్టరేట్‌కు రావాల్సిన పనిలేకుండా క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 146 అర్జీలు అందాయి. అందులో 94 అర్జీలు రెవెన్యూ సమస్యలకు చెందినవిగా గుర్తించారు. ఆ మేరకు అధికారులకు కలెక్టర్ గడువులోపు పరిష్కరించాలని చెప్పారు. ఇబ్బందులు ఉంటే అర్జీదారుడుకి సమస్యను వివరించాలని ఆదేశించారు. డీఆర్వో పెంచలకిషోర్, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రామ్మోహన్, కోదండరామిరెడ్డి పాల్గొన్నారు. ఇదిలావుండగా అర్జీలు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు వచ్చిన ఫిర్యాదుదారులకు తాగునీటి ఇక్కట్లు తప్పలేదు. గత నాలుగు వారాలుగా ఇదే పరిస్థితి ఎదురవుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ

ఏర్పేడు: శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని నూతన విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో నూతన విద్యార్థులు, తల్లిదండ్రులతో సమగ్ర ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఓరియంటేషన్ కార్యక్రమం విద్యార్థుల కోసం కొత్త విద్యాప్రయాణానికి నాంది అని పేర్కొన్నారు. నూతన విద్యా సంవత్సరానికి గాను బీటెక్, ఎంటెక్, మాస్టర్ ఇన్ పబ్లిక్ పాలసీ, ఎంఎస్‌బై రీసెర్చ్, పీహెచ్‌డీ ప్రోగ్రాంలలో కొత్తగా విద్యార్థులు చేరినట్లు వివరించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, విద్యార్థి ప్రతినిధులతో ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహించారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

వరదయ్యపాళెం: మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రధాన అధికారి డాక్టర్ శ్రీనివాసరావు ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ బృందంలోని జిల్లా గణాంకాధికారి నాగేంద్రకుమార్, ఇన్‌చార్జ్ డీపీహెచ్‌ఎంఓ బేబీరాణి, డీపీఓ ప్రకాష్ సోమవారం మండలంలోని కాంబాకం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలు, గర్భవతులు, బాలింతలు రక్తహీనతతో మరణించకూడదని, అందుకు సంబంధించిన వైద్య సదుపాయాలు సకాలంలో కల్పించాలని తెలిపారు. ప్రతి కాన్పు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే విధంగా చూడాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలకు, గర్భవతులకు ఇచ్చే బలవర్థక ఆహారాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో క్షేత్రస్థాయి వైద్య రికార్డులను పరిశీలించి ధ్రువీకరించారు. చిన్న పాండూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి అనిత, పీహెచ్ఎన్ రాణెమ్మ, ఎంపీహెచ్‌ఓ రవీంద్రుడు, సూపర్‌వైజర్ పవనకుమారి, సీహెచ్‌ఓ బేబి, ఏఎన్ఎం కామేశ్వరి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

స్పీడ్ తగ్గించండి



చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి

తిరుపతి అర్బన్: స్పీడ్ తగ్గించాలని, క్రమం తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని డీపీటీఓ చెంగల్‌రెడ్డి చెప్పారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి శ్రీనివాసు సేతుపై ఆర్టీసీ బస్సుల వేగాన్ని తగ్గించాలన్నారు. కొందరు కండక్టర్లు వంతెనపై బస్సును నిలిపి టిక్కెట్ కొడుతున్నారని, మరికొందరు కొంత దూరమే కదా అంటూ ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమిస్తున్నారని తెలిపారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు.

బయటపడిన మహా విష్ణువు ఆలయం



తిరుమూరులో బయట పడిన పురాతన విగ్రహం

వాకాడు: మండలంలోని తిరుమూరులో చెట్ల మధ్యలో ఉన్న 300 ఏళ్ల నాటి పురాతన మహా విష్ణువు ఆలయం బయటపడింది. ఈ వైష్ణవ ఆలయం బ్రిటీష్ హయాంలో నిర్మించారని కొందరు, పల్లవులు నిర్మించారని మరికొందరు చెబుతున్నారు. దీనికి సంబంధించిన ఆధారాలు చిట్టమూరు మండలం, యాకసిరి తిప్పపై ఉన్న భూ పతేశ్వరస్వామి ఆలయంలో ఉన్నాయని పేర్కొంటున్నారు. ఈ ఆలయం గ్రామంలో ఎప్పటి నుంచో చెట్ల మధ్యలో ఉందని, 250 ఏళ్ల క్రితం వరకు పూజలు జరుగుతుండేవని, ఆ తర్వాత మరుగున పడిపోయిందని పెద్దలు చెబుతున్నారు. కొందరు సాహసించి చెట్ల పొదలను తొలగించడంతో పురాతన ఆలయం వెలుగులోకి వచ్చిందని, అందులో విగ్రహం కూడా ఉందని గ్రామస్తులు తెలిపారు.

సీడీసీ డీన్‌గా చంద్రాయుడు



నియామకపత్రాన్ని అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) నూతన డీన్‌గా జాగ్రఫీ విభాగం ప్రొఫెసర్ ఎస్ చంద్రాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ డాక్టర్ అప్పారావు సోమవారం నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన సీడీసీ డీన్‌గా బాధ్యతలు చేపట్టారు. వర్సిటీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.